రామయ్యగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఎన్నికల పోలింగ్ ప్రక్రియను

పారదర్శకంగా నిర్వహించాలి

వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

పీవోలు, ఏపీవోలకు పోలింగ్‌పై శిక్షణ

వికారాబాద్, ఏప్రిల్ 2 : పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం వికారాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ నిర్వహణపై ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ శిక్షణా కేంద్రాలను సందర్శించిన సందర్భంగా పీవోలు, ఏపీవోలను పోలింగ్ ప్రక్రియపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎలాంటి పొరపాట్లకు తావీయకుండా పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా సమర్థవంతంగా పని చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ నియమావళిని అనుసరించి విధులు నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఇచ్చిన హ్యాండ్ బుక్‌లెట్స్‌ను క్షుణ్ణంగా చదివి పోలింగ్ విధానాన్ని తెలుసుకోవాలని, ఇంకా ఏవైనా అనుమానాలు ఉన్నట్లయితే మాస్టర్ ట్రైనర్లను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఎన్నికల విధి నిర్వహణలో అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించి ఎన్నికలు సజావుగా జరిగేలా సంసిద్ధం కావాలని సూచించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పనిచేసిన అనుభవంతో పార్లమెంటు ఎన్నికల్లోనూ సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, మాస్టర్ ట్రైనర్లు రాంరెడ్డి, వీరకాంతం ఉన్నారు.

డీ హైడ్రేషన్‌పై అవగాహన కల్పించాలి

డీ హైడ్రేషన్(నిర్జలీకరణ) నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ వైద్యాధికారులకు సూచించారు. రామయ్యగూడ(అనంతగిరిపల్లి) ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. అవుట్ పేషంట్, సిబ్బంది హాజరు పట్టికలు, ఔషధ నిలువ గదిని పరిశీలించారు. ఆసుపత్రిలో ప్రసవాలకు సంబంధించి ఈడీడీ(ఎక్స్పెక్టెడ్ డేటా ఆఫ్ డెలివరీ) బోర్డులో నమోదు చేసిన గర్భిణుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకొని ఆసుపత్రిలో కనీస అవసరాలు తీర్చే దిశగా మౌలిక సదుపాయాలు సమకూర్చుకోవాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఎప్పటికీ నిల్వ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి ఆశ వర్కర్, క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది వద్ద కూడా వందకు తగ్గకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. వేసవిలో తగిన మోతాదులో నీరు తీసుకోకపోవడం వల్ల డీ హైడ్రేషన్‌కు గురవుతారనే విషయాన్ని ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. మనం తాగే నీటి కంటే ఎక్కువ నీటిని మన శరీరం నుంచి కోల్పోయినప్పుడు డీ హైడ్రేషన్‌కు గురవుతామనే విషయాన్ని తెలియజేయాలని, డీ హైడ్రేషన్ సాధారణ సంకేతాలు, లక్షణాలకు సంబంధించి, అదేవిధంగా తీసుకోవలసిన జాగ్రత్తలపై కూడా ప్రజలకు వివరించాలని కలెక్టర్ సూచించారు. డీ హైడ్రేషన్‌కు గురైన వ్యక్తులకు సత్వర వైద్య సేవలు అందించేందుకు కావలసిన మందులను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ వైద్యాధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పాల్వన్‌కుమార్, వైద్యాధికారి డాక్టర్ సృజన, ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

పోలింగ్ నిర్వహణ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న పీవోలు, ఏపీవోలు

పీవో, ఏపీవోల శిక్షణ తరగతుల్లో రంగారెడ్డి కలెక్టర్ శశాంక

పోలింగ్ విధులపై

పూర్తి అవగాహన కలిగి ఉండాలి

పీవో, ఏపీవోలకు నిర్వహిస్తున్న శిక్షణా శిబిరంలో సూచనలు, సలహాలిస్తున్న కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ) : లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక అన్నారు. ఎలాంటి సందేహాలున్నా శిక్షణా తరగతుల్లో మాస్టర్ ట్రైనర్లతో నివృత్తి చేసుకోవాలని సూచించారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు బాలాపూర్ మండలం గుర్‌రంగూడలోని స్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను కలెక్టర్ మంగళవారం పర్యవేక్షించారు. ఫెసిలిటేషన్ సెంటర్లు, పీవోలు, ఏపీవోలకు అందిస్తున్న హ్యాండ్ బుక్, శిక్షణ ఇస్తున్న తీరును పరిశీలించారు. పీవోలు, ఏపీవోలను ఉద్దేశించి కలెక్టర్ కీలక సూచనలు చేశారు. శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకుని ఎన్నికల విధులకు సంబంధించిన అన్ని అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇంతకుముందు ఎన్నికల విధులు నిర్వర్తించినవారు కూడా ట్రైనింగ్ క్లాసులను తేలికగా తీసుకోకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనల గురించి తెలుసుకోవాలన్నారు. పోలింగ్ డే సందర్భంగా పీవోలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్వర్తించాల్సిన బాధ్యతల గురించి క్లుప్తంగా వివరించారు. కొందరు పీవోలు శిక్షణకు రాకుండా అంతా తమకు తెలిసిందేనన్న అతి విశ్వాసం కారణంగా తప్పులకు ఆస్కారం కలుగుతుందన్నారు. డిస్ట్రిబ్యూషన్ రోజు ఈవీఎంలను తీసుకుని పోలింగ్ డే పూర్తయిన తర్వాత సాయంత్రం తిరిగి ఇవ్వాల్సిన బాధ్యత పీవోలదేనని కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టర్ వెంట మహేశ్వరం ఏఆర్వో, ఆర్డీవో సూరజ్‌కుమార్, సంబంధిత అధికారులు ఉన్నారు.

ఎన్నికలకు సిబ్బంది సన్నద్ధం

రంగారెడ్డి, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ) : లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలక్షన్ కమిషన్ సిబ్బందిని సన్నద్ధులను చేస్తున్నది. ఎన్నికల్లో విధులు నిర్వర్తించేందుకు జిల్లాలో మొత్తం 16,536 మందిని ఎంపిక చేయగా..సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ ఇటీవలనే పూర్తయింది. ఓటరు నమోదు నుంచి అభ్యర్థుల నామినేషన్లు, పోలింగ్, కౌంటింగ్ వరకు అధికారులు, ఎన్నికల సిబ్బంది కీలకంగా వ్యవహరించనుండగా.. శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

మూడు విడుతల్లో శిక్షణ

ఎన్నికల విధుల కోసం నోడల్, సెక్టోరల్ అధికారులను నియమించారు. అలాగే.. 4,076 మంది ప్రిసైడింగ్ అధికారులు, 3,968 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 7,952 మంది అదనపు ప్రిసైడింగ్ అధికారులు, 540 మంది మైక్రో అబ్జర్వర్స్‌ను నియమించారు. వీరికి శిక్షణ ఇచ్చే మాస్టర్ ట్రైనర్స్‌కు ఇప్పటికే శిక్షణ ఇవ్వగా.. ప్రస్తుతం వీరితో ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. పోలింగ్ కేంద్రాలలో ప్రిసైడింగ్ అధికారులదే కీలకపాత్ర కాగా.. వీరికి పకడ్బందీగా మూడు విడతల్లో శిక్షణ కొనసాగుతున్నది. ప్రస్తుతం రెండో విడుత శిక్షణా తరగతులు జరుగుతున్నాయి. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ అధికారిని నియమించగా.. ఈవీఎంలు, వీవీ ప్యాట్లను పోలింగ్ కేంద్రానికి తీసుకొచ్చి ఓటింగ్ అనంతరం వాటిని స్ట్రాంగ్ రూంకు చేర్చే వరకు పీవోనే బాధ్యత వహిస్తారు. పీవోకు సహాయకారిగా ఏపీవో, ఓపీవోలు ఉంటారు. వీరితోపాటు ఇద్దరు పోలింగ్ అధికారులు విధులు నిర్వర్తిస్తారు. ఈవీఎంల పనితీరుపై సిబ్బందికి పూర్తి అవగాహన ఉండడంతోపాటు వాటి పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా శిక్షణ ఇస్తున్నారు.

పోస్టల్ బ్యాలెట్‌లో ప్రలోభాలకు తావివ్వకుండా..

ఎన్నికల విధులు నిర్వర్తించే వారికి ఎన్నికల కమిషన్ పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పిస్తున్నది. గతంలో పోస్టల్ బ్యాలెట్ జారీ చేసిన రోజు నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొదలయ్యే రోజు వరకు ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకునేవారు. ఆ విధానంలో రాజకీయ ఒత్తిళ్లు, ప్రలోభాలకు ఆస్కారం కలుగుతున్నదన్న ఉద్దేశంతో ఎన్నికల కమిషన్ ఈ విధానంలో మార్పులు, చేర్పులు చేసింది. ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు శిక్షణ శిబిరాలను నిర్వహిస్తూనే.. మరోవైపు ఓటు హక్కును ఉపయోగించుకునేలా ఏర్పాట్లు చేసింది. పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు కోసం శిక్షణ కేంద్రాల్లోనే ఫాం-12 అందజేస్తున్నారు. ఆర్వో నుంచి పొందిన పోస్టల్ బ్యాలెట్‌ను శిక్షణా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకునేలా అవకాశాన్ని కల్పించారు. పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునేవారికి రాష్ట్ర ప్రభుత్వం ఒక రోజు సాధారణ సెలవు దినాన్ని మంజూరు చేస్తున్నది.

ప్రవేశం లభిస్తే.. దశ తిరిగినట్లే..

- కేంద్రీయ విద్యాలయాల్లో ఒకటో తరగతికి దరఖాస్తుల ఆహ్వానం
- 2 నుంచి 10వ తరగతి వరకు ఖాళీ సీట్లకు దరఖాస్తులు
- ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవడానికి గడువు ఏప్రిల్ 15

మొయినాబాద్, ఏప్రిల్ 2 : ఆహ్లాదకరమైన వాతావరణం.. అత్యాధునిక సదుపాయాలు.. విలువలతో కూడిన విద్య.. క్రమశిక్షణకు మారు పేరు.. వ్యక్తిత్వంతో పాటు మానవీయ విలువలను బోధిస్తూ.. ఉన్నతంగా విద్యార్థులను తీర్చిదిద్దడం కేంద్రీయ విద్యాలయాల ప్రత్యేకత. నాణ్యమైన విద్యతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించేలా తయారుచేస్తారు. క్రమశిక్షణతో పాటు దేశభక్తిని పెంపొందిస్తారు. జీవితంలో ఉన్నతంగా స్థిరపడవచ్చని విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపుతారు. ఆధునాతన సాంకేతిక విద్యనందించే కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలు పొందడానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ప్రవేశాలకు నోటిఫికేషన్ వేయడంతో తమ పిల్లలను చేర్పించడానికి విద్యార్థుల తల్లిదండ్రులు కేంద్రీయ విద్యాలయాలకు పరుగులు తీస్తున్నారు. కేంద్రీయ విద్యాలయాల సంఘటన్ 2024-25 సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసింది.

వీరికి ప్రాధాన్యం..

ప్రవేశాల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, రక్షణ రంగంలో పని చేసేవారికి తొలి ప్రాధాన్యత ఉంటుంది. కేంద్ర అనుబంధ సంస్థలు (బీఎస్ఎన్ఎల్, ఎల్ఐసీ, బ్యాంక్, పోస్టల్ తదితర), రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఆర్టీసీ, ఎన్పీడీసీఎల్ తదితర.. ఒకే సంతానం కలిగిన కుటుంబాల్లోని వారికి ప్రాధాన్యం ఉంటుంది. పార్లమెంటు సభ్యులు, రాజ్యసభ సభ్యులు, కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ, కేవీఎస్ ఉన్నతాధికారుల సిఫారసు చేసిన విద్యార్థులకు ప్రవేశంలో ప్రాధాన్యత కల్పిస్తారు. తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి పరీక్ష ఉంటుంది. 3 గంటల వ్యవధిలో 100 మార్కుల పరీక్ష రాయాలి. హిందీ, గణితం, ఆంగ్లం, సైన్స్, సోషల్ పాఠ్యాంశాల్లో ఈ పరీక్ష ఉంటుంది. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు ప్రతిభ ఆధారంగా చేపడుతారు. ఎక్కువగా సీట్లు ఖాళీ ఉండి వెయిటింగ్‌లో విద్యార్థులు ఉంటే లాటరీ పద్ధతిలో అర్హుల ఎంపికను చివరి దశలో నిర్వహిస్తారు.

రిజర్వేషన్‌లు ఇలా..

కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలు పొందడానికి రిజర్వేషన్‌ల ప్రాతిపదికను సీట్లను కేటాయిస్తారు. ఎస్సీలకు 15 శాతం (12 సీట్లు), ఎస్టీలకు 7.5 శాతం (6 సీట్లు), 3 శాతం సీట్లు దివ్యాంగులకు రిజర్వు అవుతాయి. మిగిలిన సీట్లను ఇతరులకు కేటాయిస్తారు. జాతీయ విద్యా హక్కు చట్టం (ఆర్ఈటీ) నిబంధనల మేరకు ప్రతి తరగతిలో 10 సీట్లను ఉచిత బోధనా పద్ధతిలో భర్తీ చేస్తారు. లాటరీ ద్వారా వీరి ఎంపిక ఉంటుంది. ఒకటో తరగతిలో ఆర్ఈటీ కింద ప్రవేశం పొందితే పాఠశాల చదువు పూర్తయ్యే వరకు ఉచిత బోధన లభిస్తుంది. kvsonlineadmission.kvs.gov.in లేదా kvssangathan.nic.in వెబ్‌సైట్‌లో 1వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఈ వెబ్‌సైట్‌లోనే ప్రవేశాలకు సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులో ఉంది.

దరఖాస్తుల ప్రక్రియ..

* ఒకటో తరగతి ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించే ప్రక్రియ ఏప్రిల్ ఒకటి నుంచి ప్రారంభమైంది. ఏప్రిల్ 15న సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు.
* మొదటి మెరిట్ లిస్ట్ ఏప్రిల్ 23న (ఒకటో తరగతి గత ప్రవేశాలు)
* రెండో మెరిట్ లిస్ట్ ఏప్రిల్ 30న (మొదటి లిస్ట్‌లో మిగిలిన సీట్లు)
* మూడో మెరిట్ లిస్ట్ మే 5న (రెండో లిస్ట్‌లో మిగిలిన సీట్లు)

రెండో నోటిఫికేషన్..

* 2వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం వరకు ప్రవేశాలకు ఏప్రిల్ 1 నుంచి 10 వరకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.
* 2వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రతి తరగతిలో ఖాళీలను ప్రకటించి నోటిఫికేషన్ జారీ చేసిన తరువాత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మెరిట్ జాబితా ప్రకారం ప్రవేశాలను కల్పిస్తారు.
* లిస్ట్‌లో ఉన్నవారు మాత్రమే తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కేంద్రీయ విద్యాలయాల్లో సంప్రదించి ప్రవేశాలు పొందాలి.

సీట్లు ఇలా..

ఒక్కో కేంద్రీయ విద్యాలయానికి 40 చొప్పున సీట్లు ఉంటాయి. తాజాగా 1వ తరగతికి ప్రతి విద్యాలయంలో 40 ప్రవేశాలను నూతనంగా కల్పిస్తారు. ఆపై విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలనుకుంటే కేంద్రీయ విద్యాలయాల సంఘటన్ ఉన్నత స్థాయి అధికారులు, కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది.

వయస్సు, అర్హత..

1వ తరగతి ప్రవేశానికి 2024 మార్చి 31 నాటికి 5 ఏండ్లు, 2వ తరగతి 6 ఏండ్లు, 3వ తరగతి 7 ఏండ్లు, 4వ తరగతికి 8 ఏండ్లు, 5వ తరగతికి 9 ఏండ్లు, 6వ తరగతికి 10 ఏండ్లు, 7వ తరగతికి 11 ఏండ్లు, 8వ తరగతికి 12 ఏండ్లు, 9వ తరగతికి 13 ఏండ్లు, 10వ తరగతికి 14 ఏండ్ల నిండి ఉండాలి

కేంద్రీయ విద్యాలయాల్లో సీబీఎస్ఈ సిలబస్‌లో బోధన ఉంటుంది. పిల్లలపై ఎటువంటి ఒత్తిడి లేకుండా నాణ్యమైన విద్య అందిస్తారు. ఒకటో తరగతి నుంచే సాంకేతిక పరిజ్ఞానంతో పరిచయం, శాస్త్ర సాంకేతికపై అవగాహన పెంపొందించే కార్యక్రమాలు ఉంటాయి. మిగిలిన పాఠశాలలకు భిన్నంగా దీని పని వేళలు, సెలవులు ఉంటాయి. ఆటపాటలు, స్వేచ్ఛతో కూడిన విద్య పిల్లలకు అందుతుంది. ఒక్కసారి కేవీలో ప్రవేశం లభిస్తే ఇక విద్యార్థి దశ తిరిగినట్లే.. ఆ సదావకాశాన్ని పొందేందుకు త్వరపడాల్సిన అవసరం ఉన్నది. 8వ తరగతి విద్యార్థులకు నవోదయ స్కూల్‌లో 9వ తరగతిలో ప్రవేశం కోసం ఎంట్రెన్స్ టెస్ట్ ఉంటుంది.

ఫీజు వివరాలు..

* అడ్మిషన్ పొందే విద్యార్థులు రూ.25 ప్రవేశ రుసుం చెల్లించాలి.
* 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులు నెలకు రూ.500 చొప్పున చెల్లించాలి.
* 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు కంప్యూటర్ బోధన కోసం రూ.100 చెల్లించాలి.
* 9, 10 తరగతి విద్యార్థులకు అదనంగా నెలకు రూ.200 చెల్లించాలి.
* 11, 12 తరగతి విద్యార్థులకు ట్యూషన్ ఫీజు కింద అదనంగా నెలకు రూ.400 చెల్లించాలి.

భువనగిరి సమావేశాన్ని విజయవంతం చేయండి

- బీఆర్ఎస్ శ్రేణులకు పార్టీ రంగారెడ్డిజిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పిలుపు
- ముఖ్యఅతిథిగా హాజరుకానున్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

ఇబ్రహీంపట్నంరూరల్, ఏప్రిల్ 2 : నేడు భువనగిరిలోని సాయి కన్వెన్షన్‌హాల్‌లో జరిగే భువనగిరి పార్లమెంటరీ స్థాయి సమావేశానికి ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావాలని బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరవుతున్నట్లు తెలిపారు. భువనగిరి ఎంపీ బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశానికి వచ్చే శ్రేణులు ఉదయం 9 గంటలకు పెద్దఅంబర్‌పేట్ ఔటర్‌రింగ్‌రోడ్డు వద్దకు చేరుకోవాలని సూచించారు.

భయంతో ఆత్మహత్య

మన్సూరాబాద్, ఏప్రిల్ 2 : కారు నడుపుతూ రోడ్డు ప్రమాదానికి కారణమైన ఓ వ్యక్తి భయాందోళనకు గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వనస్థలిపురంలోని ఎఫ్‌సీఐ కాలనీకి చెందిన గుమ్మడి రితీష్‌రెడ్డి (30) వ్యాపారి. దిల్‌సుఖ్‌నగర్ నుంచి ఎన్టీఆర్‌నగర్‌లోని ఆద్యా ఆస్పత్రికి మంగళవారం మధ్యాహ్నం 12:10 గంటల సమయంలో కారులో వచ్చి పార్కింగ్ చేశాడు. భయాందోళనతో ఉన్న అతడు ఆస్పత్రి 4వ అంతస్తుకు వెళ్లి.. కిటికీలో నుంచి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

ప్రమాద భయంతో..

నగరంలో కారులో వెళ్తున్న రితీష్‌రెడ్డి ఓ వ్యక్తిని ఢీకొట్టాడని, అతడికి తీవ్ర గాయాలు కావడంతో బాధితుడికి సంబంధించిన ఇద్దరు యువకులు రితీష్‌రెడ్డిని బైకుపై వెంబడించడంతో భయాందోళనకు గురయ్యాడని తెలిసింది. రోడ్డు ప్రమాదంపై బాధితులు కేసు నమోదు చేయిస్తే జైలుకు వెళ్లాల్సి వస్తుందన్న భయంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. రోడ్డు ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు.

అప్రమత్తతే మేలు..

- రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- వికారాబాద్ జిల్లాలో లక్ష ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచిన వైద్యాధికారులు

వికారాబాద్, ఏప్రిల్ 2 : ఎండాకాలం ప్రారంభం కావడంతో రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. దీని వల్ల ఎండలో పని చేసేవారు వడదెబ్బ బారినపడి అనారోగ్యాలకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. నీరు, ఖనిజ లవణాలు విసర్జింపబడుట వలన డీ హైడ్రేషన్‌కు గురై వడదెబ్బ తగులుతుంది. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటి నుంచి బయటకు వెళ్లకూడదు. నీరు, పళ్లరసాలు ఎక్కువగా తీసుకోవాలి. ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది ఆయా గ్రామాల్లో జరిగే మహిళా సంఘాల సమావేశాలకు హాజరై వడదెబ్బ వల్ల కలిగే పరిణామాలపై తెలియజేయాలి. అవసరమైతే వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఎంజీఎన్ఆర్ఈఎంజీఎస్ కింద పని చేసే వారి కోసం ప్రత్యేకంగా మేట్లు, టెక్నికల్ అసిస్టెంట్ల వద్ద కూడా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయి.

వడదెబ్బ లక్షణాలు..

> ఒకేసారి తీవ్రమైన జ్వరం రావచ్చు
> తలనొప్పి, తలతిప్పుట, వికారం, వాంతులు అవుతాయి
> విపరీతమైన చెమటలు పట్టడం, చర్మం పొడిగా మారడం
> తికమకపడుట, మూర్ఛపోవుట, కడుపులో తిప్పడం, నొప్పి రావడం
> కొన్ని సమయాల్లో 1, 2 సార్లు నీళ్ల విరేచనాలు కావడం
> నాడి బలహీనంగా కొట్టుకొనుట, రక్తపోటు (బీపీ)తగ్గుట
> దాహంతో నాలుక పిడుచుకట్టుకపోవడం, శరీరానికి కావలసిన నీరు తగినంత లభించక హృదయం, మూత్ర పిండాలు తదితర సున్నితమైన అవయవాలు తమ తమ పనులు నిర్వర్తించకపోవడం వలన మనిషి చనిపోవడం జరుగుతుంది
> వృద్ధులు, చిన్నపిల్లలు ఎక్కువగా వడ దెబ్బకు గురయ్యే అవకాశం ఉంటుంది

తీసుకోవలసిన జాగ్రత్తలు..

> ఎక్కువ సమయం ఎండలో గడుపరాదు
> వ్యవసాయదారులు, వ్యవసాయ కూలీలు, ఎండలో పని చేసే ఇతరులు ఉదయం 11 గంటలకు ముందు.. సాయంత్రం 5 గంటల తరువాత పని చేయాలి
> ఒక వేళ ఎండలో పని చేయాల్సి వస్తే ప్రతి గంటకు చల్లని నీరు తాగాలి
> తల రక్షణకు గుడ్డ లేదా టోపీ పెట్టుకోవాలి
> ఓఆర్ఎస్ ద్రావణం, నిమ్మకాయ రసం, కొబ్బరి నీళ్లు, మజ్జిగ తదితర పానీయాలు తరచుగా తాగాలి
> వడ దెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే చల్లని ప్రదేశానికి తరలించి, గాలి వెలుతురు బాగా తగిలేటట్లు చూడాలి. అనంతరం 108కి ఫోన్ చేసి సమీప దవాఖానకు తరలించాలి.

తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి

ప్రతి రోజూ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నందున ప్రజలు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బయట తిరగకూడదు. ఎండ వేడిని తట్టుకునేందుకు ఎక్కువగా మంచి నీరు తీసుకోవాలి. వీలైతే లెమన్, మజ్జిగ, వివిధ రకాల పండ్ల రసాలు తీసుకోవాలి. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు ఎండలో తిరగకూడదు. తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సి వస్తే తలపై టోపి, గొడుగు ధరించాలి. ఎవరికైనా వడదెబ్బ తగిలితే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ప్రజలకు అందుబాటులో లక్ష ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉన్నాయి. ప్రతి ఆశ వర్కర్ వద్ద 100 ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయి. వడదెబ్బ తగులకుండా జిల్లా ఆరోగ్య శాఖ చర్యలు తీసుకుంటున్నది.

- డాక్టర్ పాల్వన్‌కుమార్, జిల్లా వైద్యా, ఆరోగ్య శాఖ అధికారి, వికారాబాద్

రూ.19.5 లక్షలు కొట్టేసిన సైబర్ చీటర్స్

సిటీబ్యూరో, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ) : ట్రేడింగ్ టిప్స్ పేరుతో నగరానికి చెందిన ఓ బాధితుడి నుంచి సైబర్ నేరగాళ్లు రూ.19.5 లక్షలు కాజేశారు. బాధితుడు వాట్సాప్ నంబర్‌కు ట్రేడింగ్‌కు సంబంధించిన అలయాంజ్ గ్లోబల్ వీఐపీ పేరుతో ఓ మెసేజ్ వచ్చింది. ఆన్‌లైన్ ట్రేడింగ్‌పై వారానికి రెండు ట్రైనింగ్ క్లాసులుంటాయని సూచించారు. బాధితుడు ట్రేడింగ్ ఖాతా ఓపెన్ చేసి, రూ.10 వేల నుంచి రూ. 15 వేల వరకు షేర్స్ కొన్నాడు. దీనితో లాభాలు ఎక్కువగా రావని వెల్త్ మేనేజ్‌మెంట్ ప్లాన్‌లో రూ.5లక్షలు పెటుబడి పెట్టాలని, 20 లక్షలు స్టూడెంట్ వర్చువల్ లోన్ ఇప్పిస్తానని, ఇందులో ఒక నెల వడ్డీ ఉండదంటూ సూచించారు. రూ. 21.7 లక్షలు పెట్టుబడి పెట్టి, షేర్స్ మొదట్లో కొనడంతో అధిక లాభాలొస్తాయంటూ నమ్మించి ఆ మొత్తాన్ని సైబర్ నేరగాళ్లు డిపాజిట్ చేయించారు. అందులో నుంచి రూ. 2.2 లక్షలు లాభం వచ్చిందంటూ విత్‌డ్రా చేసుకునే అవకాశాన్ని కల్పించారు. మిగతా డబ్బు డ్రా చేసుకోవాలంటే.. 20 శాతం పన్ను చెల్లించాలంటూ షరతు విధించి, వాట్సాప్ గ్రూప్‌లో నుంచి బాధితుడి నంబర్‌ను తొలగించారు. దీంతో బాధితుడు సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కృష్ణాజలాలు వృథా

- తక్కళ్లపల్లిగేటు వద్ద ప్రధాన పైపు లీకేజీ
- ప్రమాదకరంగా మారిన రేలింగ్
- పట్టించుకోని అధికారులు

తక్కళ్లపల్లిగేటు వద్ద పైప్‌లైన్ లీకేజీల ద్వారా నిత్యం వృథాగా పోతున్న కృష్ణాజలాలు

యాచారం, ఏప్రిల్2 : నాగార్జునసాగర్ నుంచి హైదరాబాద్‌కు తాగున